అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

లక్ష్యాలకు అనుగుణంగా అర్జీలకు పరిష్కారం

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీల పరిష్కారం, జిల్లా అభివృద్ధికి సంబంధించిన అంశాలపై లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుంచి 224 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలకు సంబంధించి అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలపై సమగ్ర ఆడిట్ నిర్వహించాలని డిఆర్ఒ, ఆర్డీవో, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను ఆదేశించారు. యోగాంధ్ర కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి ఒక్కరూ యోగా గొప్పతనాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. జిల్లాలో 4 పర్యాటక ప్రాంతాల్లో భారీ స్థాయిలో యోగ ప్రదర్శించాలని తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 28న పుట్టపర్తి, జూన్ 4న కదిరి, 6న ధర్మవరం, 15న పెనుకొండ, 18న హిందూపురంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. జూన్ 21న జిల్లాస్థాయిలో లేపాక్షిలో యోగాంధ్రను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జిఎం నాగరాజు, సిపిఒ విజయ్ కుమార్, ఎల్‌డిఎం రమణకుమార్, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు శివరంగ ప్రసాద్, మోహన్ రావు, డీఎఫ్‌వో చక్రపాణి, హౌసింగ్ పీడీ వెంకట నారాయణ, క్రీడల అధికారి ఉదయ్ భాస్కర్, డీఎంహెచ్ఒ ఫిరోజ్ బేగం, ఆర్అండ్‌బి ఎస్ఇ సంజీవయ్య పాల్గొన్నారు.

సాగునీరివ్వరు.. సంక్షేమాన్నీ వర్తింపజేయరు..!

- ◆ తీరని తాడిపత్రి బ్రాంచ్‌కెనాల్ రైతుల అవస్థలు
- ◆ నీరు లేక బీడుగానే పొలాలు
- ◆ రేషన్‌కార్డులివ్వకుండా నిర్లక్ష్యం
- ◆ కూటమి ప్రభుత్వం స్పందించాలని వేడుకోలు

అనంతపురం జిల్లా పరిధిలోని తాడిపత్రి బ్రాంచ్ కెనాల్(టిబిసి) రైతుల కష్టాలు తీరడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నాయి తప్పా వీరి సమస్యలు మాత్రం తీరడం లేదు. సాగునీరు అందించి పొలాలను సాగులోకి తేవాల్సిన ప్రభుత్వాలు ఆ దిశగా ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. ఈ కెనాల్ పరిధిలోని భూములు సాగునీటి భూములుగా నమోదు కావడంతో ఐదు ఎకరాలు పైబడిన రైతులకు రేషన్‌కార్డులు ఇవ్వడం లేదు. దీంతో వీరు ప్రభుత్వ పథకాల సంక్షేమ లబ్ధికి దూరం అవుతున్నారు. ఓ వైపు సాగునీరు లేక.. మరోవైపు ప్రభుత్వ సంక్షేమం అందక టిబిసి రైతులు కష్టాలను చవిచూస్తున్నారు.

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

జిల్లాకు సాగునీటిని అందించాలన్న ఉద్దేశంతో కర్నాటక రాష్ట్రం తుంగభద్ర డ్యామ్ నుంచి హెచ్ఎల్‌సి, ఎల్ఎల్‌సిలను ఏర్పాటు చేశారు. హెచ్ఎల్‌సి (హై లెవెల్ కెనాల్) జిల్లాలో పెనకచర్ల వద్ద నిర్మించిన మిడ్ పెన్నార్‌లో కలుస్తుంది. హెచ్ఎల్సీ కింద అనంతపురం జిల్లాకు నీటి సరఫరా చేసే ఏర్పాటు చేశారు. వీటికి అనుసంధానంగా నిర్మించిన సుబ్బరాయ సాగర్ నుంచి తాడిపత్రి, పుట్లూరు, యల్లనూరు మండలాలకు సాగునీరు అందేలా తాడిపత్రి బ్రాంచ్ కెనాల్‌ను నిర్మించారు. తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ మూడు మండలాలు, 13 డిస్ట్రిబ్యూటర్ల పరిధిలో 28 వేల ఎకరాల సాగునీటి విస్తీర్ణం కలిగి ఉంది. దీని పరిధిలో ఉన్న రైతులకు ప్రతి సీజన్‌కు 90 రోజుల పాటు సాగునీరివ్వాలనే నిబంధన ఉన్నా అది అమలు కావడం లేదు.

ఐదెకరాలు పైబడిన వారికి రేషన్‌కార్డు కట్

తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ పరిధిలో ఐదు ఎకరాలు పైబడిన రైతులకు ఆరుతడి కింద భూములు ఉన్నాయంటూ ఆన్‌లైన్‌లో రికార్డులు ఉన్నాయి. సాగునీటి వినియోగం కింద ఉన్న భూములుగా రికార్డుల్లో నమోదు కావడంతో దీని పరిధిలోని రైతులకు రేషన్ కార్డులు ఇవ్వడం లేదు. రేషన్‌కార్డులు లేకపోవడంతో ప్రభుత్వం అందించే పలు రకాల సంక్షేమ పథకాలకు వీరంతా దూరం అవుతున్నారు. తాడిపత్రి మండలంలోని పెద్దపడమల, చిన్నపడమల, కోమలి, చిన్నపల్లి, ఎర్రగుంటపల్లి, రావి వెంకటంపల్లి, తిమ్మాపురం, తెరన్నపల్లి, ఎగువపల్లి, దిగువపల్లి, కొనగుంటపల్లి రైతులు ప్రభుత్వ పథకాలు నోచుకోక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వంలో ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి అర్జీల రూపంలో తీసుకెళ్లినా పరిష్కారం కాలేదు. కూటమి ప్రభుత్వం అయినా తమ సమస్యపై దష్టి సారించాలని ఇక్కడి రైతులు కోరుతున్నారు. కాలువలకు నీళ్లైనా వదలండి.. లేదా రేషన్ కార్డు అందించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ పరిధిలోని రైతులు కోరుతున్నారు.

పుట్లూరు మండలంలో ఉన్న సుబ్బరాయ సాగర్

అధికారులకు విన్నపాలు

తాడిపత్రి బ్రాంచ్‌కెనాల్ పరిధిలోని రైతులు పలుమార్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. తాడిపత్రి బ్రాంచ్ కెనాల్‌కు ప్రతి సీజన్‌లో 90 రోజులు నీళ్లు వదలాలని ఉన్నా అలా నీరిచ్చిన దాఖలాలు లేవు. సాగునీరు ఇవ్వని నేపథ్యంలో భూములు ఆరుతడి కింద ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని రైతులు కోరుతున్నారు. తహశీల్దార్ స్థాయి నుంచి జిల్లా అధికారుల వరకు ఈ సమస్యను రైతులు విన్నవించినా ఇప్పటికీ పరిష్కారానికి నోచుకోలేదు.

కూటమి ప్రభుత్వం స్పందించాలి

టిబిసి కాలువ కింద ఉన్న ఐదు ఎకరాలు పైబడి ఉన్న రైతులకు రేషన్ కార్డులు ఇవ్వడం లేదు. కాలువకూ నీరు ఇవ్వలేదు. ఓ వైపు పంటల సాగు లేక, మరోవైపు రేషన్‌కార్డులు లేక సమీప గ్రామాల రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా ఇక్కడి రైతుల సమస్యలను మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం తాడిపత్రి బ్రాంచ్ కెనాల్‌ను పరిశీలించి, ప్రతి సీజన్‌కు 90 రోజులు నీళ్లు వదిలేలా చర్యలు తీసుకోవాలి. అక్కడి రైతులకు వెంటనే రేషన్ కార్డులను అందించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలి.

రాజారామిరెడ్డి, రైతు సంఘం మండల కార్యదర్శి.

భూ సమస్యను పరిష్కరించండి

అధికారుల వద్ద ఓ సైనికుడి మొర

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మీడియాతో మాట్లాడుతున్న సైనికుడు చౌడేష్

దేశభద్రతలో విధులు నిర్వహిస్తున్న ఓ సైనికుడు తన భూమి సమస్యను పరిష్కరించాలంటూ అధికారుల చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణలు చేస్తున్నారు. అధికారులు స్పందించకపోవడంతో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి అయినా స్పందించి తన సమస్యను పరిష్కరించాలంటూ మీడియా వేదికగా ఆవేదన వ్యక్తం చేశాడు. సోమవారం నాడు పుట్టపర్తి కలెక్టరేట్‌కు వచ్చిన ఆయన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో అర్జీ అందించాడు. బాధితుడు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... గోరంట్ల మండల కేంద్రానికి చెందిన చౌడేష్ భారత సైన్యంలో సైనికుడిగా పని చేస్తున్నాడు. ఈయనకు చెందిన పాలసముద్రం పంచాయతీ రాగిమేకలపల్లి సర్వేనెంబర్ 11లోని భూమిని గత వైసిపి ప్రభుత్వంలో కొందరు కబ్జా చేశారు. ఇందుకు సంబంధించి తనకు న్యాయం చేయాలని పలుమార్లు సైనికుడు అధికారులకు విన్నవించుకున్నా సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తన భూమి సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని సైనికుడు విజ్ఞప్తి చేశారు.

అధ్వానంగా ఉన్న రహదారి

మరమ్మతుకు నోచని ముచ్చురామి రహదారి.!

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణం నుంచి మండలంలోని రేగాటిపల్లి పంచాయతీ పరిధిలోని ముచ్చురామి వెళ్లే రహదారి చాలా అధ్వాన్నంగా తయారైంది. ఈ రహదారిలో ఉన్న వంకపై కల్వర్ట్ బాగా దెబ్బతిని ప్రమాదకరంగా ఉంది. దీంతో పరిసర గ్రామాల ప్రజలు ధర్మవరం నుంచి ముచ్చురామి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కల్వర్టు వద్ద ఎదురుగా వాహనాలు వస్తే ఏమాత్రం ఏమరు పాటుగా ఉన్నా ప్రమాదం జరిగే అవకాశం ఉందని వాహనదారులు వాపోతున్నారు. ఈ మార్గంలో రోజూ పలు పాఠశాలల బస్సులు కూడా విద్యార్థులను తీసుకెళ్తుంటాయి. రైతులు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లలో పొలాలకు రాకపోకలు సాగిస్తుంటారు. మూడు నెలలు క్రితం మంత్రి సత్యకుమార్ యాదవ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, తదితరులు రేగాటిపల్లి చెరువులో జలహారతి కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో ఈ రహదారిని పరిశీలించి మరమ్మతులు చేపడతామని హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదని ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ రహదారిలో మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ పేర్కొన్నారు. వార్డు పర్యటనలో భాగంగా సోమవారం త్యాగరాజనగర్, ఆర్.టి.సి. కాలనీల్లో పర్యటించారు. ఇందులో రహదారులు, మురికి కాలువలు, పారిశుధ్యం, వీధి దీపాలు, నీటి సమస్యలపై ఇబ్బందులు పడుతున్నామని ఆయా ప్రాంతాల ప్రజలు చైర్మన్ దష్టికి తెచ్చారు.

బలవంతపు భూ సేకరణ ఎవరి ప్రయోజనాల కోసం..?

హిందూపురం, లేపాక్షి తహశీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు, రైతులు

ఆందోళనలో ఎపి రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

బలవంతపు భూసేకర ఎవరి ప్రయోజనాల కోసమో అధికారులు, పాలకులు తెలపాలని ఎపి రైతుసంఘం నాయకులు నిలదీశారు. ఈ భూముల సేకరణ అదానీ కోసమా, లేక అంబానీ కోసమా అని ప్రశ్నించారు. హిందూపురం, లేపాక్షి మండలాల పరిధిలో అధికారులు చేపడుతున్న బలవంతపు భూసేకరణను ఆపాలని డిమాండ్ చేస్తు సోమవారం ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రైతులు, సిఐటియు నాయకులు హిందూపురం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వెంకటేశు అందుబాటులో లేక పోవడంతో వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి, కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, ఉపాధ్యక్షులు రాచపల్లి సిద్ధారెడ్డి, రైతు సంఘం సీనియర్ నాయకులు ధనాపురం వెంకటరామిరెడ్డి, ఓపిడిఆర్ శ్రీనివాసులు, సిఐటియు పట్టణ కన్వీనర్ వీఆర్ రాములు మాట్లాడుతు రైతులకు అందుబాటులో ఉంటానని చెప్పిన తహశీల్దార్ రైతులు, రైతు సంఘం నాయకులు న్యాయం కోసం కార్యాలయానికి వస్తున్నారని తెలిసి అందుబాటులో ఉండక పోవడంపై తహశీల్దార్ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. చట్టాలను, రైతులను గౌరవించాల్సిన తహశీల్దార్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని అన్నారు. రైతుల భూమి పాస్ పుస్తకాలు, బ్యాంక్ పాసు పుస్తకాలను తీసుకుని రావాలని చాటింపు వేయాల్సిన అవసరం ఏముందన్నారు. భూసేకరణ చేస్తున్నారా...? భూ సేకరణ చేస్తుంటే ఎవరి ప్రయోజనాల కోసం చేస్తున్నారు. అనే విషయాలను రైతులకు వివరించాల్సిన బాధ్యత తహశీల్దార్ పై ఉందన్నారు. రైతులకు ఏమి చెప్పకుండా భూసేకరణ ఎలా చేపడుతున్నారని అధికారులకు ప్రశ్నించారు. పంటలు పండే భూములను లాక్కుంటే రైతులు ఎలా జీవనం చేయాలని ప్రశ్నించారు. రైతులకు ఇష్టముంటేనే భూమిని సేకరించాలని చట్టాలు చెబుతున్నా ఆ చట్టాలను ఉల్లంఘించి బలవంతపు భూసేకరణ చేయడం ఎంతవరకు న్యాయమన్నారు. ఇప్పటి వరకు భూ సేకరణ ద్వారా సేకరించిన భూముల్లో పరిశ్రమలను తీసుకురాలేని ప్రభుత్వం... తాజాగా పరిశ్రమల పేరుతో భూములను తీసుకోవడానికి ఎలా ముందుకు వచ్చిందని నిలదీశారు. భూసేకరణ పేరుతో ప్రభుత్వం భూములను సేకరించి, అంబానీ, ఆదాలనీలకు అప్పలంగా అప్పగిస్తు వ్యవసాయం నుంచి రైతులను దూరం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు 5 గంటల పాటు రైతులు, నాయకులు కార్యాలయం ముందు ఆందోళన చేశారు. చివరకు తహశీల్దార్ మధ్యాహ్న సమయానికి కార్యాలయానికి వచ్చారు. దీంతో నాయకులు, రైతులు ఆయనకు సమస్యలను వివరించి, వినతిని ఇచ్చారు. ఈ విషయంపై తహశీల్దార్ వెంకటేశుమాట్లాడుతూ 2021లో ప్రభుత్వం స్పోర్ట్స్, ఐటీ కంపెనీల ఏర్పాటు కోసం భూమి సర్వే చేయడం జరిగిందని ప్రస్తుతం ఈ కంపెనీలకు సంబంధించి సమాచారం కోసం కొంత మంది. అధికారులు గ్రామాల్లో సర్వే చేయడం జరిగిందని చెప్పారు. దీంతో రైతులు శాంతించి ఆందోళనను విరమించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి చిన్నపరెడ్డి. రైతులు రామలింగారెడ్డి, రామకృష్ణారెడ్డి, రంగప్ప, రామప్ప, శ్రీరామ రెడ్డి, రాజారెడ్డి, శివలింగారెడ్డి, శ్రీనివాసరెడ్డి, చంద్రకళతో పాటు అధికసంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండల పరిధిలోని కొండూరు, తిమ్మగాని పల్లి గ్రామాల్లో చేపడుతున్న బలవంతపు భూసేకరణ ఆపాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆసంఘం ఆధ్వర్యంలో రైతులు సోమవారం స్థానిక కరెంటు ఆఫీస్ నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం ముందు బైటాయించి ఆందోళన చేపట్టారు. బలవంతపు భూసేకరణ ఆపాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ కొండూరు, తిమ్మగాని పల్లి రెవిన్యూ పొలంలో ప్రభుత్వం బలవంతంగా భూసేకరణకు పూనుకుందని ఈ చర్యలను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గ్రామ సభలు అడ్డుకుంటామన్నారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ తరతరాలుగా వారసత్వంగా వస్తున్న భూములను ఎలా సేకరిస్తారని ప్రశ్నించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ కుమార్ స్వామి రెడ్డికి వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పిరంగి ప్రవీణ్ కుమార్, పెద్దన్న, రాజప్ప, రైతులు సోమశేఖర్ రెడ్డి, నారాయణ నాయక్, మహిళలు పెద్ద ఎత్తున మహిళా రైతులు పాల్గొన్నారు.

టిడిపి మండల కన్వీనర్‌కు సన్మానం

ప్రజాశక్తి - రొద్దం

టిడిపి మండల కన్వీనర్ గా ఎంపికైన నరహరిని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. రొద్దం మండల కన్వీనర్‌గా నరహరిని రెండవసారి తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఎంపిక చేసింది. దీంతో నరహరి స్వగ్రామం రొప్పాలలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాము, గోపి తదితరులు పాల్గొన్నారు.

నరహరిని సన్మానిస్తున్న నాయకులు, కార్యకర్తలు

జాతీయ సమైక్యత శిబిరంలో తెలుగు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-హిందూపురం

కర్ణాటక రాష్ట్రంలోని బెళగావిలో జరుగుతున్న జాతీయ సమైక్యత శిబిరంలో ఎస్కేయూ, అనుబంధ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఉత్తమ ప్రతిభను కనబరిచి,విజేతలుగా నిలిచారని యస్ కే యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగపు సమన్వయకర్త ప్రొఫెసర్ మురళీధర్ రావ్ పేర్కొన్నారు. భారత యువజన సర్వీసుల శాఖ సహకారంతో వివిధ రాష్ట్రాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు వారం రోజులపాటు బెళగావిలో జరిగిన జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొని వారి సంస్కృతి సంప్రదాయాలతో పాటు, సామాజిక, వర్ధమాన, దేశభక్తికి సంబంధించిన వివిధ అంశాలపై సందేశాత్మక నాటకాల్ని ప్రదర్శించారన్నారు. అన్ని రాష్ట్రాల కలయికతో గ్రూప్ 4 టీం మతసామరస్యంపై ప్రదర్శించిన నాటకానికి ప్రథమ బహుమతి రాగా అందులో తెలుగు విద్యార్థులు వెంకట సాయి, దీపిక కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఎస్కేయూ, అనుబంధ కళాశాలల నుండి వెళ్లిన పదిమంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ టీంగా ప్రదర్శించిన నాటకానికి తృతీయ బహుమతి వచ్చిందన్నారు.

నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పట్టణంలోని గోకులం, బస్ డిపో నుంచి గణేష్ సర్కిల్ వరకు చేపట్టిన ఫుట్‌పాత్ నిర్మాణ పనులను ఆర్డీవో సువర్ణ, అధికారులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, పలువురు వంక పోరంబోకు భూమిని సైతం ఆక్రమించుటకు ప్రయత్నించారని మున్సిపాలిటీ పరిధిలో ఈ స్థలంలో ఎవరుకబ్జాలకు పాల్పడకూడదనే లక్ష్యంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫుట్ పాత్ నిర్మించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కళ్యాణ్, మున్సిపల్ కమిషనర్ క్రాంతి కుమార్, ఏఈ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్:-

రానున్న 3 రోజులలో రాష్ట్రంలో మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించిందని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. జిల్లాలో మంగళవారం తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురుస్తాయని, గంటకి 40కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తెలిపారు, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా రెవిన్యూ సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి మండల ప్రధాన కేంద్రంలో, డివిజన్ ప్రధాన కేంద్రాలలో రెవెన్యూ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని తెలిపారు, ప్రతి మండల ప్రధాన కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలని, పకృతి వైపరీత్యాల వల్ల ఎలాంటి నష్టం జరిగిన వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని తెలిపారు, కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు కంట్రోల్ రూమ్ నెంబర్ 08555 289039 ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

విచ్చలవిడిగా చెట్లు నరికివేత

ప్రజాశక్తి రొద్దం

విచ్చలవిడిగా పచ్చని చెట్లు నరికి వేస్తున్నా సంబందిత అధికారులు పట్టించుకోవటం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. సోమవారం పట్టపగలే పెనుగొండ పావుగడ ప్రధాన రహదారిలో గాలి మరల వద్ద ప్రధాన రహదారి పక్కనే దాదాపు 20 వేప చెట్లు అప్పటికప్పుడు నరికివేసి వాహనాల ద్వారా పెనుగొండ మండల కేంద్రానికి చెందిన సామిల్ కేంద్రానికి తరలించారని స్థానికులు తెలిపారు. 407 వాహనంలో చెట్ల కొమ్మలను, మొద్దులను వేసుకుని దర్జాగా తరలిస్తున్నారన్నారు, ప్రతిరోజు మండలవ్యాప్తంగా వందల చెట్లను నరికివేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా సంబందిత అధికారులు స్పందించి కలప అక్రమ రవాణాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

చెట్ల మొద్దులను వాహనంలోకి వేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి
www.prajasakti.com

భూ సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి - నల్లచెరువు

మండల పరిధిలోని మద్దిమడుగు రెవిన్యూ గ్రామానికి సంబంధించిన ఎం.అగ్రహారం పంచాయతీలోని తమ భూమి సమస్యను పరిష్కరించాలని బాధితులు పద్మావతి, సుబ్బమ్మ కోరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమకు చెందిన భూమిని పాసుబుక్కులో ఎక్కించాలని గత కొన్ని నెలలుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నామన్నారు. తమ సమస్యను ఎవరికి చెప్పినా పరిష్కరించలేదన్నారు. ఈ విషయంపై దృష్టి సారించి తమకు న్యాయం చేయాలని తహశీల్దార్ రవికుమార్‌ను కోరారు.

ఆర్డీటీ సేవలు కొనసాగేలా చూడాలి

ప్రజాశక్తి - నల్లచెరువు

అనంతపురం ఉమ్మడి జిల్లాలోనే పేదలను అన్ని విధాలా ఆదుకుంటున్న ఆర్డీటీ సేవలు ఇలాగే కొనసాగేలా పాలకులు చూడాలని స్థానికులు కోరారు. ఈసందర్భంగా వారు సేవ్ ఆర్డీటీ నినాదంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలు తహశీల్దార్ రవికుమార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆయాగ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

యోగాపై అవగాహన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలో ప్రజలకు యోగాపై అవగాహన కల్పించనున్నట్లు ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజలతో ప్రతిరోజు జూన్ 21 తేదీ వరకు యోగా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల వ్యాప్తంగా గ్రామస్థాయిలో ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా మండలంలో ఇప్పటివరకు 5800 కుటుంబాలు సర్వే చేయగా వాటిలో వెయ్యి మంది యోగా చేయడానికి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. ఈనెల 28న పుట్టపర్తిలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున యోగాపై ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ ర్యాలీలో మండల ప్రజలు పాల్గొనాలని తెలిపారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - నంబులపూలకుంట

రైతుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహశీల్దార్ దేవేందర్‌గౌడ్ తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండలంలోని విఆర్వోలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రీ సర్వే గ్రామాలలో రైతులకు సమస్యలు లేకుండా చూడాలన్నారు. ఎవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీధర్, విఆర్వోలు రఘు, భారతి తదితరులు పాల్గొన్నారు

నష్టపరిహారం అందించండి

ప్రజాశక్తి - ముదిగుబ్బ

ముదిగుబ్బ నుంచి పుట్టపర్తి ఎన్ హెచ్ 342 జాతీయ రహదారికి భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వ ధర ప్రకారం పరిహారం అందించాలని బాధిత రైతులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక తహశీల్దార్‌కు అందజేశారు. అంతకు ముందు రహదారి పనులను రైతులు, నాయకులు అడ్డుకున్నారు. ప్రభుత్వ వాల్యుయేషన్ ప్రకారం తమకు పరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోమల ప్రకాష్ నాయుడు, రమేష్ బాబు ,సనత్ కుమార్, విశ్వనాథ్, ప్రభాకర్ నాయుడు, హనుమంతు, అశోక్, రాగినాయుడు, ప్రసాద్ ,లక్ష్మీదేవి, నరసమ్మ, రైతులు పాల్గొన్నారు.

టిడిపి మండల కన్వీనర్‌గా వెంకటేష్

ప్రజాశక్తి-సోమందేపల్లి

టిడిపి సోమందేపల్లి మండల కన్వీనర్‌గా మాజీ ఎంపీపీ నడింపల్లి వెంకటేష్‌ను నియమించినట్లు ఆపార్టీ నాయకులు తెలిపారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో మాజీ కన్వీనర్ సిద్ధి లింగప్ప ఆధ్వర్యంలో నూతన కన్వీనర్ వెంకటేష్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ కష్టపడి పని చేసిన వారికి టిడిపిలో ఎప్పటికీ గుర్తింపు ఉంటుందన్నారు. అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. తనకు ఈ పదవి రావటానికి సహకరించిన మంత్రి సవితకు సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ సంఘం అధ్యక్షులు సిసి హరి దాస్, టిడిపి హిందూపురం పార్లమెంట్ కార్యదర్శి నీరగంటి చంద్రశేఖర్, నియోజకవర్గ కార్యదర్శి సూర్యనారాయణ జన సైనికుడు గంగాధర్, నాయకులు రంగన్న గోపాల్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని వినతి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ డ్రైవర్లు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిత్రాన్ని కలెక్టర్ టీఎస్. చేతన్‌కు సోమవారం అందజేశారు. సోమవారం కలెక్టరేట్లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కారం వేదికలో కలెక్టర్ చేతన్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, ట్రెజరర్ జాఫర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కేవలం 550 మంది తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్‌లకు డ్రైవర్లుగా పని చేస్తున్నామని తెలిపారు. తమకు అరబిందో యాజమాన్యం చెల్లించే వేతనం సరిపోవడం లేదని పేర్కొన్నారు. గత 9 సంవత్సరాలుగా అరబిందో సంస్థ ద్వారా కేవలం రూ.8, 800 వేతనానికి పని చేస్తున్నామని తెలిపారు. ఈ వేతనం తమ జీవనం గడపడానికి సరిపోవడంలేదని వాపోయారు. ఇవే కాకుండా తమ డిమాండ్లను తీర్చాలని కోరారు. చర్యలు చేపట్టాలని కోరారు.

రోడ్డు స్థలాన్ని కాపాడాలని వినతి

ప్రజాశక్తి - గోరంట్ల

సమస్యను తహశీల్దార్‌కు వివరిస్తున్న నాయకులు

మండలంలోని వడిగే పల్లి పంచాయతీ గొల్లపల్లి గ్రామంలో పొలాలకు వెళ్లే రస్తాను ఆక్రమించారని ఈవిషయంలో అధికారులు స్పందించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు నాయకులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం స్థానిక తహశీల్దాకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రశేఖర్ అను వ్యక్తి రైతుల పొలాలకు, గ్రామస్తులు ఉపయోగించే బండి రస్తాను ఆక్రమించి ముళ్ల కంచె వేసి ఇబ్బందులు గురి చేస్తున్నాడు. . గ్రామ సర్వేయర్ ద్వారా కొలతలు వేసి హద్దులు చూపించినా అతని ప్రవర్తన మారలేదన్నారు. రోడ్డు వేయడానికి ఉపాధి హామీ నిధులు సుమారు 5 లక్షల రూపాయలు మంజూరు అయిన రోడ్డు వేయనీయకుండా అడ్డుపడుతున్నాడన్నారు. ఈ సమస్యను చట్టబద్ధంగా పరిష్కారం చేయాలని తహశీల్దార్ మారుతిని కోరారు. స్పందించిన ఆయన మండల సర్వేయర్‌తో మాట్లాడి త్వరగాసమస్యను పరిష్కారం చేసేందుకు చర్యలు తీసుకుంటామని అవసరమైతే పోలీసుల సహకారం కూడా తీసుకొని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు నాగభూషణ, ఇండ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు ఆంజనేయులు , వెంకటరాముడుతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి మడకశిర

రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని కెవిపిఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు కెవిపిఎస్ ఆధ్వర్యంలో రైతులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులు సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వాలన్నారు. 90 శాతం సబ్సిడీతో వేరుశనగ. ఎరువులు అందజేయాలన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ కార్యాలయంలో అందజేశ్వారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామాంజనేయములు, గోవిందప్ప, రవి, ముత్యాలు, రఘు, ఉగ్ర నరసింహప్ప రైతులు పాల్గొన్నారు,

నిరసనలో పాల్గొన్న నాయకులు, రైతులు

కార్మికులకు బకాయి వేతనాలివ్వాలి

ప్రజాశక్తి - గాండ్లపెంట

పారిశుధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షష్టులు జిఎల్. నరసింహులు, కోశాధికారి సాంబశివ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని బస్సు స్టాప్ వద్ద ఐదవ రోజు రిలే నిరాహార దీక్షలు చేస్తున్న శిబిరం వద్దకు వెళ్లిన నాయకులు తమ సంఘీభావం తెలపారు. అక్కడ నుంచి పారిశుధ్యకార్మికులు ర్యాలీతో నాలుగు రోడ్ల కూడలిలో గంటపాటు రాస్తారోకో నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 20 నెలల నుంచి పారిశుధ్యకార్మికులకు ఉన్న పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.తమ సమస్యను అధికారులకు, పాలకులు పలుమార్లు విన్నవించినా వారు పట్టించుకోవటం లేదని విమర్శించారు. కార్మికుల సమస్యలపై ఎంపీడీవో వెంకటరామిరెడ్డి తనకేమీ పట్టనట్లుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. మూడు రోజుల్లో పెండింగ్ వేతనాలు మంజూరు చేయకపోతే రోడ్డుమీద వంట వార్పు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ముస్తాక్, బాబ్జాన్, రైతు సంఘం నాయకులు కేకే రాజారెడ్డి, ఖాదర్‌బాషా, పారిశుధ్య కార్మికులు అక్కులప్ప, బాలకృష్ణ, ఆంజనేయులు, నరసింహులు, కదిరప్ప, రమణమ్మ, గంగులప్ప, తదితరులు పాల్గొన్నారు.

రాస్తారోకోలో సిఐటియు నాయకులు

రాస్తారోకోలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

శ్రీశైలానికి ప్రత్యేక బస్సు

కదిరి టౌన్ : కదిరి డిపో నుండి ఇది వరకు తాడిపత్రి మీదుగా నడుస్తున్న శ్రీశైలం సూపర్ లగ్జరీ బస్సు సర్వీసును పులివెందుల,వేంపల్లి,కడప,మైదుకూరు, నంద్యాల మీదుగా నడుపుతున్నట్లు కదిరి ఆర్టీసీ డిపో మేనేజరు బి.మైనోద్దీన్ తెలిపారు. ప్రతి రోజు రాత్రి 7 : 30 గంటలకు బయలుదేరి, ఉదయం 6 : 15 కి శ్రీశైలం చేరుతుందని, తిరిగి శ్రీశైలంలో అదే రోజు రాత్రి 6 :30 గంటలకు బయలు దేరి కడప మీదుగా ఉదయం 5:30 గంటలకు కదిరికి చేరుకుంటుందని చెప్పారు. ఈ సౌకర్యాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టిడిపిలో పలువురు చేరిక

మడకశిర : మండల పరిధిలోని ఆమిదాల గొంది పంచాయతీ ఎఆర్ రొప్పం గ్రామానికి చెందిన 60 కుటుంబాలు టిడిపిలో చేరాయి. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సమక్షంలో గ్రామానికి చెందిన వైసిపి నాయకులు తెలుగుదేశం పార్టీలో సోమవారం చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, పరిశీలకులు శివప్రసాద్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు రాజా, ఉమాశంకర్, ప్రధాన కార్యదర్శి రంగే గౌడ్, నాయకులు ఆర్ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న సీనియర్, జూనియర్, యల్ డి కంప్యూటర్స్ సిబ్బంది తమ సమస్యల పరిష్కారం కోసం సోమవారం స్థానిక డిఎంహెచ్ఒ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రెసిడెంట్ ప్రసాద్ ,సెక్రటరీ సుందర్ రాజు, ట్రెజరర్ జావిద్ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ప్రతి జిల్లా కేంద్రంలోనూ వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. ముఖ్యంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ (ఈ హెచ్ ఆర్) ను అదనంగా పని భారం పెడుతున్నారని, దీనివలన ఎంతో మంది ఉద్యోగులు ఇబ్బందులకు గురి అవుతున్నారని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ హెచ్ ఆర్ ను ఉపసంహరించు కోవాలని, ఉద్యోగుల పరిధిలో ఉన్న పనులు మాత్రమే కేటాయించాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిత్రాన్ని డిఎంహెచ్ఒ ఫిరోజా బేగంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఆయా ప్రాంతాల్లోని వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

డిఎంహెచ్ఒకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

వైసిపి లీగల్‌సెల్ అధ్యక్షుడికి సన్మానం

ప్రజాశక్తి-పెనుకొండ

వైసిపి మండల లీగల్ సెల్ అధ్యక్షుడిగా ఎంపికైన న్యాయవాది బాలాజీని సీనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు వాల్మీకి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. ఈసందర్భంగా రాష్ట్ర వైస్సార్సీపీ జాయింట్ సెక్రటరి నాగరాజు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి యువ న్యాయవాదులను ప్రోత్సహించుటకు లా నేస్తం పథకం అమలు చేసి నెలకు రూ.3 వేలు అందించారన్నారు. ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ న్యాయవాదులు ఆర్థికంగా నిలదొక్కు కోవడానికి ఇది ఉపయోగ పడిందన్నారు. యువ న్యాయవాదులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి అండగా ఉండాలని, బాలాజీ ఇంకా అత్యున్నత పదవులు పొందాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జావిద్, హరీష్, రవి, నాగిరెడ్డి న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పంచాయతీరాజ్ అధ్యక్షులుగా జగన్మోహన్ చౌదరి

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

వైసిపి మండల పంచాయతీ రాజ్ అధ్యక్షుడిగా చింతమని పల్లి బోయపాటి జగన్మోహన్ చౌదరి నియమిస్తూ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా జగన్మోహన్‌చౌదరి మాట్లాడుతూ తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు.

'పాఠ్య పుస్తకాల పేరుతో ప్రయివేటు పాఠశాలల దోపిడీ'

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలో ఉన్న పలు ప్రయివేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాల పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని విద్యార్థిసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు వైఎస్ఆర్ఎస్‌యు, పిఎస్‌యు, ఎఐఎస్‌బికి చెందిన నాయకులు సోమవారం ధర్మవరం మండల విద్యాశాఖ అధికారిని రాజేశ్వరి దేవి కి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ పట్టణంలో పలు ప్రయివేటు పాఠశాలల నిర్వాహకులు అక్రమ అడ్మిషన్లు చేపడుతున్నారని విమర్శించారు. పాఠశాల తరగతులు పున: ప్రారంభం కాకమునుపే అడ్మిషన్ల పేరుతో విద్యార్థులనుచ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారన్నారు.కొన్ని ప్రైవేట్ పాఠశాల వారు హాస్టల్ పర్మిషన్ లేకపోయినా నడుపుతున్నారని ఆరోపించారు. అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలలోనే పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, షూ, టై బెల్ట్ లాంటివి కూడా తమ పాఠశాలలోనే కొనుగోలు చేసుకోవాలని విద్యార్థులను విద్యార్థుల తల్లిదండ్రులను ప్రవేట్ పాఠశాలల నిర్వాహకులు ఒత్తిడి తీసుకువస్తున్నారన్నారు. పుస్తకాల ఒక్కొక్క సెట్టు రూ. 6000 నుంచి 7వేల రూపాయల వరకు విక్రయిస్తున్నారన్నారు. ఫీజుల స్ట్రక్చర్ నోటీసు బోర్డులో అతికించకుండా వేల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు, ప్రైవేట్ పాఠశాలపై తక్షణమే చర్యలు తీసుకొని, ప్రైవేట్ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని కోరారు లేని పక్షంలో భవిష్యత్తులో పాఠశాలల ఎదుట, ప్రభుత్వ కార్యాలయాలు ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు మంజుల నరేంద్ర, వైయస్సార్ఎస్‌యు జిల్లా అధ్యక్షులు పురుషోత్తం ఏఐఎస్బి జిల్లా కార్యదర్శి పోతలయ్య వైయస్సార్ఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి అమర్నాథ్ రెడ్డి, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

మహానాడును విజయవంతం చేయండి

ప్రజాశక్తి - పెనుకొండ

తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 44వ మహానాడు విజయవంతం చేయాలని తెలుగుదేశం నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం కార్యకర్తలు, స్టోర్ డీలర్లు తదితరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కడపలో ఈనెల 27, 28, 29 వ తేదీలలో జరిగే మహానాడుకు పంచాయతీ పరిధిలోని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. మంత్రి సవిత ఆధ్వర్యంలో నియోజకవర్గానికి 100 బస్సులను ఏర్పాటు చేశారన్నారు. ప్రతి మండలానికి 20 బస్సులు కేటాయించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, మాజీ జెడ్పిటిసి నారాయణస్వామి, మండల కన్వీనర్ ఈశ్వర ప్రసాద్, పట్టణ కన్వీనర్ శ్రీరాములు యాదవ్, మైనార్టీ నాయకుడు దాదు, రఘువీరా చౌదరి, బాబుల్ రెడ్డి, త్రివేంద్ర నాయుడు, సోమశేఖర్, మహిళా నాయకురాలు చంద్రకాంతమ్మ రమణమ్మ లక్ష్మీదేవి జనసేన నాయకురాలు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

తలుపుల : కడపలో ఈనెల 27 28 29 తేదీలలో నిర్వహిస్తున్న టిడిపి మహానాడుకు మండలంలోనిముస్లిం మైనారిటీలు పెద్ద ఎత్తున తరలిరావాలని తలుపుల మండల 17వ బూత్ ఇంచార్జ్ షేక్అలీ కోరారు. కదిరి ఎమ్మెల్యే, కందికుంట వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ మహానాడు సభలో తలుపుల మండలం ముస్లిం మైనార్టీ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గోరంట్ల : ఈనెల 29న కడపలో జరిగే టిడిపి మహానాడును విజయవంతం చేయాలని టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి కోరారు. మండలకేంద్రంలోని టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులు స్టోర్ డీలర్లు ఫీల్డ్ అసిస్టెంట్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ మాట్లాడుతూ మహానాడుకు మండలంలోని టిడిపి నాయకులు శ్రేణులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్, సుబ్బారెడ్డి, అశ్వర్థ రెడ్డి, మరి రెడ్డి పల్లి నరసింహులు, చంద్రశేఖర్ రెడ్డి, అజమతుల్లా, ఉత్తమ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిగి : కడపలో నిర్వహించే టిడిపి మహానాడును విజయవంతం చేయాలని ఆపార్టీ మండల కన్వీనర్ గోవింద్ కోరారు. మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిగి మండలం నుండి మంత్రి సవిత ఆధ్వర్యంలో అధికసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు మహానాడుకు తరలివెళుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు బాలాజీ, సూర్యనారాయణ, సోమప్ప. నాగభూషణ, పరిటాలశివ తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : కడపలో ఈనెల 27, 28, 29 న జరిగే టిడిపి రాష్ట్ర మహానాడుకు టిడిపి శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కోరారు. మహానాడుకు వెళ్లడానికి అవసరమయ్యే వాహనాల ఏర్పాట్లను నియోజకవర్గంలోని ఆయా మండల నాయకులు కార్యకర్తలతో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చర్చించారు. ఆ కార్యక్రమానికి పెద్ద ఎత్తున పుట్టపర్తి నియోజకవర్గం నుంచి నాయకులు,కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి పెనుకొండ మండల కన్వీనర్

మడకశిర : కడప జిల్లాలో జరుగు టిడిపి మహానాడు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పి స్వామి కోరారు. మంత్రి నారా లోకేష్ బాబుకి తెలుగుదేశం పార్టీ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు గా ఎన్నుకోవాలని ఇప్పుడు జరగబోవు మహానాడు కార్యక్రమంలోనే తీర్మానం చేయాలని ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి నియోజకవర్గ టిడిపి నాయకులు కార్యకర్తలతో కలిసి తీర్మానం చేసి అబ్జర్వర్ శివప్రసాద్ కి అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, కన్వీనర్లు లక్ష్మీనారాయణ, ఆమిదాల గొంది ఆర్ భాస్కర్ రెడ్డి,, కన్వీనర్లు, కౌన్సిలర్లు రాజు, మేఘన రమేష్ నాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కంచెసముద్రంలో చోరీ

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని కంచె సముద్రం గ్రామానికి చెందిన మురళి అనే వ్యక్తి ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది, మురళి ప్రతి రోజు తన భార్యతో కలసి పొలం లో వెళ్లే వారు. వారి వారి తండ్రి, తమ్ముడు మరొక్క ఇంటి వద్ద పశువుల దగ్గర ఉండేవారు. దీంతో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులకొట్టి ఇంట్లో బీరువాలో ఉన్న రెండు జతలకమ్మలు, రివర్స్ చైన్, నాలుగు ఉంగరాలు, రెండు వెండి చైన్లు, రూ. 50వేల నగదు ఎత్తుకెళ్లారని బాధితుడు తెలిపాడు. బాధితుల ఫిర్యాదులో పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

భూఆక్రమణపై కేసు నమోదు

ప్రజాశక్తి - కదిరి టౌన్

పట్టణంలోని చలపతి స్కూల్ దగ్గర కోట్ల రూపాయల విలువచేసే సర్వేనెంబర్ 206లోని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు సిఐ నారాయణరెడ్డి తెలిపారు.ఈ భూమిని కొంతమంది ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నట్లు వీఆర్వోలు ఓబులేసు, ఇనయతుల్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురుపై కేసు నమోదు చేశామన్నారు. ప్రభుత్వ స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి గుంతలు తీయడానికి ప్రయత్నిస్తున్న అరుణమ్మ, ఆమె భర్త కుర్లి శివారెడ్డి, లలిత, భర్త చిన్నారెడ్డి, లక్ష్మీ దేవి, భర్త రాజారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించడానికి ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సిఐ హెచ్చరించారు.

గుర్తుతెలియని వ్యక్తి శరీర భాగాలు లభ్యం

ప్రజాశక్తి - తాడిమర్రి

మండల పరిధిలోని చిల్ల కొండయ్య పల్లి కునుకుంట్ల గ్రామానికి వెళ్లే రహదారి పక్కన గుర్తు తెలియని మనిషి శరీర భాగాలను పోలీసులు సోమవారం పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తి పుర్రె, ఇతర శరీర భాగాలను గొర్రెల కాపర్లు కనుగొని పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో ఎస్ఐ కృష్ణవేణి ఆధ్వర్యంలో పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. దాదాపు నెల రోజుల క్రితం వ్యక్తి శరీర భాగాలను విడిభాగాలుగా చేసి కవర్లు, బ్యాగులో కొండ ప్రాంతంలో ఉపాధి హామీ పనులు చేసిన గుంతలో పెద్ద బండరాళ్లతో కప్పి ఉంచినట్లు తెలుస్తోందని పోలీసులు తెలిపారు. అడవి జంతువులు గుంతను తవ్వడంతో మనిషి పుర్రె ఇతర శరీర భాగాలకు సంబంధించి ఎముకలు బయటపడ్డాయన్నారు. సంఘటన స్థలంలో ఎటువంటి ఆధారాలు లేకపోగా మృతదేహం గుర్తుపట్టలేని విధంగా ఉందని చెప్పారు. పుర్రె వెంట్రుకలు శరీర భాగంలోని కొన్ని ఎముకలు మాత్రమే ఉన్నందున ఆడ లేదా మగ అని నిర్ధారణ చేయడానికి వీలు లేకుండా ఉందన్నారు. దీంతో శరీర విడిభాగాలను పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన నవీన్ కుమార్(35) అనే వ్యక్తి సోమవారం జరిగిన రోడ్డుప్రమాదంలో మృతిచెందాడు. మండలంలోని చిగిచెర్ల రహదారిలో ద్విచక్ర వాహనంలో ధర్మవరానికి వస్తుండగా వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాడు. గమనించిన స్థానికులు వెంటనే బాధితుడిని ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే నవీన్‌కుమార్ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

సబ్సిడీ వేరుశనగ పంపిణీ

ప్రజాశక్తి - పావగడ

ప్రభుత్వం సబ్సిడీ ధరతో నాణ్యమైన వేరుశనగను పంపిణీ చేస్తోందని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే హెచ్‌వి. వెంకటేష్ తెలిపారు. సోమవారం పావగడ పట్టణంలోని ఏ.పీ.ఎం.సీ యార్డు ఆవరణలో వేరుశనగ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఎలాంటి తారతమ్యం లేకుండా నాణ్యమైన వేరుశను రైతులందరికీ సమానంగా అందజేస్తున్నట్లు తెలిపారు. రైతుల కోసం 750 క్వింటాళ్ల వేరుశనగను తెప్పించి తాలూకాలోని లింగద హళ్లి, నాగలమడిక, నిడగల్, వైఎన్ హొసకోట రైతు కేంద్రాల వద్ద వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు అజయ్‌కుమార్, మున్సిపల్ ఉపాధ్యక్షులు ఆర్.ఎ. హనుమంతరాయప్ప, రైతు సంఘం అధ్యక్షులు నరసింహారెడ్డి, పూజారప్ప, కృష్ణారావు, కాంగ్రెస్ నాయకులు హరీష్, శివమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి - కొత్తచెరువు

'పది' అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ముగిశాయని డీఈవో కిష్టప్ప తెలిపారు సత్యసాయి జిల్లా వ్యాప్తంగా 34 పరీక్ష కేంద్రాలలో సోషల్ పరీక్ష నిర్వహించగా 2911 మంది విద్యార్థులకు గాను 2466 మంది హాజరయ్యారన్నారు. జిల్లావ్యాప్తంగా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా పరీక్షలు ముగిసాయన్నారు.

పేదలకు ఇళ్లపట్టాలివ్వాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

తనకల్లు మండలం బొంతలపల్లిలో గుడిసెలు వేసుకున్న 150 మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బాధితులతో కలిసి కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొంతలపల్లి గ్రామం సర్వేనెంబర్ 183 - ఏలోని ప్రభుత్వ భూమిలో పేదలు గుడిసెలు వేసుకున్నారన్నారు. ప్రస్తుతం తనకల్లు మండల తహశీల్దార్ గుడిసెలు ఖాళీ చెయాలని లేనిపక్షంలో పోలీసుల ద్వారా గుడిసెలు వేసుకున్న వారిపై కేసులు పెడతామని పేదలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. అది ప్రభుత్వ భూమి అయినందున వెంటనే అక్కడి పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని లేదంటే పేదల పక్షాన ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కదిరప్ప, సిపిఐ కదిరి డివిజన్ కార్యదర్శి నల్లజోడు పవన్, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చౌడప్ప యాదవ్, నాయకులు అంజినప్ప, రవి, నిజాముద్దీన్, రెడ్డప్ప, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సలహామండలి సభ్యుడికి సన్మానం

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి రూరల్ మండలం సున్నపగుట్ట తండాకి చెందిన సోమ్లా నాయక్ గిరిజన సలహామండలి సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో కదిరి బంజారా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమ్లానాయక్‌ను సోమవారం సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొమ్లానాయక్ పార్టీ కి చేసిన సేవలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుర్తించారన్నారు. తన ఎంపికకు కృషి చేసిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు సోమ్లానాయక్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూక్యా అనిల్ నాయక్, మూడే రవి నాయక్, నాగరాజు నాయక్, బాలాజీ నాయక్, మూడే నరసింగ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చౌకదుకాణం ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని 24వ వార్డులో పరిధిలో చౌక దుకాణం ఏర్పాటు చేయాలని వార్డు ప్రజలు కోరారు.. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు సోమవారం అందజేశారు. ఈసందర్భంగా వైసిపి కన్వీనర్ నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వార్డులో ఉన్నా చౌక దుకాణాన్ని టిడిపి నాయకులకు కేటాయించారన్నారు. ఆయన వార్డులో కాకుండా మరో ప్రాంతంలో దుకాణం నిర్వహిస్తున్నాడన్నారు. అతను ఏ సమయంలో చౌకదుకాణం తెరుస్తారో ఎవరికి తెలియదన్నారు. ఒక్క నెల కూడా పూర్తి స్థాయిలో సరుకులను అందించడం లేదన్నారు. వెంటనే స్టోర్ డీలర్‌పై చర్యలు తీసుకుని, వార్డులోనే చౌకదుకాణం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.